క్లుప్తంగా...

'పోషణ్ పక్వాడ్'పై అవగాహన



మాట్లాడుతున్న సీడీపీఓ రేణుక

సుభాష్‌నగర్: 'పోషణ్ పక్వాడ్' లో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో సోమవారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సూరారంలోని అంగన్‌వాడీ సెంటర్లో గర్భిణులకు సీమంతం, చిన్నారులకు అన్నప్రాసన, అక్షరభ్యాసాలు చేయించారు. కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ సీడీపీఓ రేణుక, వైద్యాధికారి నవనీత, సూపర్‌వైజర్ సుజాత, జ్యోతి అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న సీఐ నర్సింహులు

జగద్గిరిగుట్ట: ఎస్‌పీఆర్ చారిటబుల్ ట్రస్ట్, లలిత హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్‌లో సోమవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి అనూహ్య స్పందన వచ్చింది. ఈ సందర్భంగా పలు వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. కార్యక్రమంలో సీఐ నర్సింహులు, ఎస్‌పీఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ సొంటిరెడ్డి పున్నారెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు రషీద్, మహేశ్ గౌడ్ , మరలింగా, పవన్, వెంకట సాయి, రోహిత్ సాయి, స్వరూప్, మనోజ్, భాస్కర్, వంశీ, శ్రీకాంత్, తేజ పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ వరంలాంటిది



ఎల్‌ఓసీ పత్రం అందజేస్తున్న కూన శ్రీశైలంగౌడ్

కుత్బుల్లాపూర్: నిరుపేదలకు సీఎంఆర్‌ఎఫ్ వరంలాంటిదని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నేత కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. షాపూర్‌నగర్‌కు చెందిన తాటి శ్రీనివాస్ అనారోగ్యంతో నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. అతడి ఆరోగ్య పరిస్థితిని శ్రీశైలంగౌడ్‌కు వివరించడంతో వెంటనే స్పందించిన ఆయన మెరుగైన వైద్యం కోసం సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రూ.2.5 లక్షలు మంజూరు చేయించి సదరు ఎల్‌ఓసీ పత్రాన్ని సోమవారం బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు కూన శ్రీశైలంగౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

మరొకరికి..



చెక్కు అందజేస్తున్న కొలన్ రాజశేఖర్‌రెడ్డి

నిజాంపేట్ : 132 డివిజన్ కుత్బుల్లాపూర్ పరిధిలోని భూమిరెడ్డి కాలనీవాసి సుంకరి వెంకటేశ్ కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స కోసం కొలన్ హన్మంత్‌రెడ్డిని సంప్రదించారు. దీంతో ఆయన వెంటనే స్పందించి రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ద్వారా శస్త్ర చికిత్స నిమిత్తం రూ. 45 వేలు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరు చేయించారు. కాగా సంబంధిత చెక్కును నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షుడు కొలన్ రాజశేఖర్‌రెడ్డి బాచుపల్లిలోని కాంగ్రెస్ కార్యాలయంలో సోమవారం అందజేశారు.

ప్రభుత్వ పాఠశాలలో 'స్వచ్ఛ భారత్'



జీడిమెట్ల: సుభాష్‌నగర్ డివిజన్ ఎస్.ఆర్.నాయక్ నగర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో బీజేపీ నాయకులు సోమవారం స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. సుభాష్‌నగర్ డివిజన్ అధ్యక్షుడు శాంపూర్ విజయేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు చీపుర్లు పట్టుకుని పరిసరాలు శుభ్రం చేశారు. ముఖ్య అతిథిగా బీజేపీ జిల్లా అర్బన్ ప్రధాన కార్యదర్శి గిరివర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. పరిసరాలు శుభ్రంగా ఉంచుకుంటే రోగాలు దరిచేరవన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర మాజీ కార్యవర్గ సభ్యులు ఎం.ఎస్.వాసు, జిల్లా కార్యవర్గ సభ్యులు సత్తిబాబు, శ్రీనివాస్, విఘ్నేష్‌గుప్తా, శారదా, వనమాల పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలు మరింత బలోపేతం..!

- పనితీరు ఆధారంగా గ్రేడింగ్‌పై కసరత్తు
- టీచర్లకు ఏ ప్లస్, ఏ, బీ, సీ గ్రేడింగ్
- మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాలో 793 కేంద్రాలు
- 1.07 లక్షల మంది లబ్ధిదారులు



సాక్షి,సిటీబ్యూరో: ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతంపై దృష్టి సారిస్తోంది. చిన్నారులు, బాలింతలు, గర్భిణీలకు మరింత నాణ్యమైన సేవలు అందించే దిశగా అడుగులేస్తోంది. దీనికోసం అంగన్‌వాడీల పనితీరు మెరుగుపరిచేందుకు గ్రేడింగ్ విధానాన్ని అమలు చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తోంది. రాష్ట్ర మహిళా, శిశుసంక్షేమశాఖ మంత్రి సీతక్క ఆయా శాఖల ఉన్నతాధికారులతో ఇటీవల నిర్వహించిన సమావేశంలో ఈ అంశంపై చర్చించారు. గ్రేడింగ్ ఆధారంగా అంగన్‌వాడీ కేంద్రాలకు అవార్డులు ప్రకటిస్తామని చెప్పారు. తద్వారా ఎప్పటికప్పుడు అంగన్‌వాడీ కేంద్రాలు అప్‌గ్రేడ్ అయ్యేందుకు అవకాశం ఉంటుందని భావిస్తున్నారు.

కేంద్రాలతో పాటు.. టీచర్లకూ..

అంగన్‌వాడీల్లో వసతులు, లబ్ధిదారులకు అందుతున్న సేవల ఆధారంగా కేంద్రాలతో పాటు టీచర్ల పనితనానికి గ్రేడింగ్ ఇచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. టీచర్లకు ఉన్న టీచింగ్ సామర్థ్యాలు, అభ్యాసన సామగ్రిపై అవగాహన ఆధారంగా ఏ ప్లస్, ఏ, బీ, సీ కేటగిరీలుగా గ్రేడ్లు కేటాయించనున్నట్లు తెలుస్తోంది. ఈ గ్రేడ్‌ల ఆధారంగానే అవార్డులు ఇవ్వనున్నారు. తక్కువ గ్రేడ్లు పొందిన టీచర్లకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాల ద్వారా మెరుగుపర్చాలని ప్రభుత్వం భావిస్తోంది.

793 కేంద్రాల్లో 1.07 లక్షల మంది..

మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాలో 793 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా.. ఇందులో 6 నెలల నుంచి ఆరేళ్ల పిల్లలు 90, 361 మంది, గర్భిణీలు, బాలింతలు 17,123 మంది ఉండగా.. మొత్తంగా 1,07,484 మంది ఉన్నారు. వీరిలో కుత్బుల్లాపూర్ ప్రాజెక్టు పరిధిలో 311 కేంద్రాలు ఉండగా.. 47,028 మంది పిల్లలు, గర్భిణీలు, బాలింతలు, మేడ్చల్‌లో 211 అంగన్‌వాడీ కేంద్రాల్లో 39,463 మంది, అల్వాల్ పరిధిలో 271 అంగన్‌వాడీ కేంద్రాల్లో 20,993 మంది పిల్లలు, గర్భిణీలు, బాలింతలు ఉన్నారు.

వసతుల సంగతేంటి..

అంగన్‌వాడీ కేంద్రాలు అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నాయి. కేంద్రాల నిర్వహణకు ప్రభుత్వం చెల్లించే అద్దెలు తక్కువగా ఉండటంతో ఇరుకు గదుల్లో కేంద్రాలను నడిపించాల్సిన దుస్థితి ఉంది. జిల్లాల్లో చాలా వరకు అంగన్‌వాడీ కేంద్రాల్లో తాగునీరు, మరుగుదొడ్లు వంటి కనీస సదుపాయాలు లేవు. దీంతో చిన్నారులు, గర్భిణులు, బాలింతలు కేంద్రాలకు రావాలంటేనే ఆలోచిస్తున్నారు. కేంద్రాల్లో సరిపోను ఫ్యాన్లు లేకపోవడంతో వేసవిలో ఉక్కపోతతో ఇబ్బంది పడుతున్నారు. మరో వైపు కేంద్రాల్లో తాగునీరు కూడా అందుబాటులో లేదు.

తాగు నీటికి ఇబ్బందే..

మేడ్చల్, మల్కాజిగిరిజిల్లాలో 793 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా.. ఇందులో 117 కేంద్రాలలో తాగునీరు తదితర సౌకర్యాలు లేవు. మేడ్చల్ ప్రాజెక్టు పరిధిలో 211 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా, అత్యధికంగా 77 కేంద్రాల్లో తాగునీటి సదుపాయం లేదు. అల్వాల్ ప్రాజెక్టు పరిధిలో 40 కేంద్రాల్లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది.

118 కేంద్రాల్లో టాయిలెట్ల సమస్య..

జిల్లాలో మొత్తం 793 అంగన్‌వాడీ కేంద్రాలకు 118 కేంద్రాల్లో టాయిలెట్లు లేవు. ఇందులో మేడ్చల్ ప్రాజెక్టు పరిధిలో 78, అల్వాల్ ప్రాజెక్టు పరిధిలో 51, కుత్బుల్లాపూర్ ప్రాజెక్టు పరిధిలో 40 అంగన్‌వాడీ కేంద్రాల్లో మరుగుదొడ్ల సమస్య తీవ్రంగా ఉంది.

☛ అద్దె భవనాల్లో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రభుత్వం ఇచ్చే అద్దె చాలా తక్కువ కావడంతో ఓనర్లు టాయ్‌లెట్లు నిర్మించి ఇచ్చే పరిస్థితి లేదు.

సొంత భవనాలు లేనివి 443 కేంద్రాలు..

జిల్లాలోని 793 అంగన్‌వాడీ కేంద్రాల్లో 212 కేంద్రాలకు మాత్రమే సొంత భవనాలు ఉన్నాయి. ఇవి కాకుండా దాతలు ఉచితంగా ఇచ్చిన 138 భవనాల్లో కూడా అంగన్‌వాడీ కేంద్రాలను నిర్వహిస్తున్నారు. మిగిలిన 443 అంగన్‌వాడీ కేంద్రాలు మాత్రం అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. కుత్బుల్లాపూర్ ప్రాజెక్టు పరిధిలో 311 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా, అత్యధికంగా 277 కేంద్రాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. అల్వాల్‌లో 271 కేంద్రాల్లో 143 కేంద్రాలు అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. మేడ్చల్‌లో 211 అంగన్‌వాడీ కేంద్రాలకు 23 మాత్రమే అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి.

24 నుంచి శిక్షణ తరగతులు

నిజాంపేట్ : వేసవి సెలవులను పురస్కరించుకుని ఈనెల 24 నుంచి మే 20 వరకు నిజాంపేట్, బాలాజీనగర్‌లోని కృష్ణా రెసిడెన్సీ నందు సద్గురు ది స్కూల్ ఆఫ్ ఆర్ట్స్‌లో పలు రకాల పెయింటింగ్స్‌పై శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు సంస్థ నిర్వాహకులు ప్రముఖ నాసికా చిత్రకారులు సత్యవోలు రాంబాబు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. డ్రాయింగ్, వాటర్ కలర్ పెయింటింగ్, ఆయిల్ పెయింటింగ్, ఆక్రిలిక్ కలర్ పెయింటింగ్, పోట్రెట్ డ్రాయింగ్, అనాటమీ డ్రాయింగ్, నైఫ్ పెయింటింగ్, హ్యాండ్ రైటింగ్ లాంటి వివిధ అంశాల్లో శిక్షణ ఇవ్వనున్నారు. 5 ఏళ్ల నుంచి పెద్దవారి వరకు ఎవరైనా నేర్చుకోవచ్చని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 9959971679, 9849490663 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

23 నుంచి జేఎన్‌వీలో దివ్యాంగుల ప్రతిభాన్వేషణ

రాయదుర్గం: శేరిలింగంపల్లి గోపన్‌పల్లిలోని జవహర్‌నవోదయ విద్యాలయలో ఈనెల 23 నుంచి 28వ తేదీ వరకు దివ్యాంగ విద్యార్థులలో ప్రతిభాన్వేషన్ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. నవోదయ విద్యాలయ సమితి డిప్యూటీ కమిషనర్ గోపాలకృష్ణ పర్యవేక్షణలో కార్యక్రమం జరగనుంది. ఈ కార్యక్రమంలో చండీఘడ్, పాట్నా, పూణే, భోపాల్, హైదరాబాద్ రీజియన్‌లోని జవహర్ నవోదయ విద్యాలయాల నుంచి 160 మంది దివ్యాంగ బాలబాలికలు పాల్గొననున్నారు. ఈ ఆర్మ్ రెజిలింగ్, సైక్లింగ్, స్విమ్మింగ్, తైక్వాండో, షూటింగ్, బ్యాడ్మింటన్, ఆర్చరీ, జూడో, సిట్టింగ్ వాలీబాల్, అథ్లెటిక్స్ నిర్వహించనున్నారు. ఈ నెల 23వ తేదీన రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని డీసీ గోపాలకృష్ణ తెలిపారు.

వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో ఎంపీ ఈటల



ఎంపీ ఈటలకు వినతిపత్రం ఇస్తున్న బీజేపీ శ్రేణులు

నిజాంపేట్ : శ్రీనివాసనగర్ కాలనీలోని వేంకటేశ్వర స్వామి దేవస్థాన బ్రహ్మోత్సవాలకు సోమవారం ఈటల రాజేందర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిజాంపేట్ బీజేపీ అధ్యక్షుడు భిక్షపతి యాదవ్ పలు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎంపీకి వినతిపత్రం అందజేశారు. కార్పొరేషన్‌లోని అర్హులైన లబ్ధిదారులకు డబుల్‌బెడ్రూం అందించాలని కోరారు. ఎంపీ నిధుల కింద బండారి లేఅవుట్ రోడ్డు నంబర్- 10ఏ పార్క్‌లో, రాజీవ్ గృహకల్ప ఇందిరమ్మ కాలనీలో బోర్లు మంజూరు చేయాలని విన్నవించారు. అలాగే 100 పడకల ప్రభుత్వ ఆస్పత్రి, గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేయాలని కోరారు. కెమికల్ పరిశ్రమల నుంచి వెలవడుతున్న విష వాయువుల నుంచి ప్రజలను రక్షించాలని విన్నవించారు. కార్యక్రమంలో బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కన్వీనర్ మల్లారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి గిరివర్ధన్‌రెడ్డి, కార్పొరేటర్ శేషగిరి, నరేంద్రచౌదరి, ప్రసాద్ రాజు, మాజీ కార్పొరేటర్ విజయలక్ష్మి, శిల్పారెడ్డి, దాసి నాగరాజు, సుమన్ రావు, ఎంఆర్‌ఎస్ రాజు, సచిన్, మాధవరావు, మదన్‌గౌడ్, భూపాల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణికి ఫిర్యాదుల వెల్లువ



వాటర్‌వర్క్స్ జీఎం అశోక్‌కు ఫిర్యాదు చేస్తున్న ప్రజలు

చింతల్: తమ బస్తీలో భూగర్భ డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ఉద్బలాపూర్ మాజీ వైస్ చైర్మన్ టి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో కుత్బుల్లాపూర్ వాటర్ బస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన భగత్‌సింగ్‌నగర్ రోడ్డు నంబర్-2 లో రూ. 60 లక్షలతో సీసీ రోడ్డు మంజూరైందని, ఇంకా రోడ్డు వేయాలేదని జీఎం అశోక్‌కు వివరించారు. అలాగే రోడ్డు నంబర్- 2లో పైపులైన్ల వ్యవస్థ అస్తవ్యస్తంగా మారి అవుట్‌లెట్ సరిగా లేకపోవడంతో మురుగునీటితో నిండిపోతుందని పేర్కొన్నారు. జీఎం అశోక్ స్పందిస్తూ డీజీఎం, సెక్షన్ మేనేజర్లను రెండు, మూడు రోజుల్లో పంపించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అదేవిధంగా షాపూర్‌నగర్ సెక్షన్ కళావతి నగర్‌లో నీటి సరఫరా సమయాన్ని పునరుద్ధరించాలని అబ్దుల్ హమీద్ ఫిర్యాదు చేశాడు. సుచిత్ర సెక్షన్ శ్రీరామ్ నగర్‌లో లోప్రెషర్‌తో నీటి సరఫరా అవుతుందని భాస్కర్ రెడ్డి ఫిర్యాదు చేశారు. అలాగే గాజులరామారం సెక్షన్ షిర్డీ హిల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో షిర్డీ హిల్స్‌కు సమయపాలన లేకుండా నీటి సరఫరా చేస్తున్నారని, అలాగే ఉషోదయ సెక్షన్ చంద్రగిరినగర్‌లో లోప్రెషర్‌లో నీటి సరఫరా అవుతుందని శృతి ఫిర్యాదు చేశారు.


జీహెచ్‌ఎంసీ జంట సర్కిళ్ల పరిధిలో..

కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్ల పరిధిలో సోమవారం జరిగిన ప్రజావాణికి ఫిర్యాదులు వెల్లువెత్తాయి. కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలో డిప్యూటీ కమిషనర్ నరసింహ అధ్యక్షతన ఏర్పాటు చేసిన ప్రజావాణికి 5 ఫిర్యాదులు వచ్చాయి. ఇందులో టౌన్ ప్లానింగ్‌కు సంబంధించి 3, ఇంజినీరింగ్ ఒకటి, శానిటేషన్ విభాగానికి సంబంధించి ఒక్కొక్క ఫిర్యాదు అందింది. అదే విధంగా గాజులరామారం సర్కిల్ పరిధిలో డిప్యూటీ కమిషనర్ మల్లారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ప్రజావాణికి 9 ఫిర్యాదులు వచ్చాయి. టౌన్ ప్లానింగ్‌కు సంబంధించి 2, ఇంజినీరింగ్ 4, ఎలక్ట్రికల్ 2, రెవెన్యూ విభాగానికి సంబంధించి 1 ఫిర్యాదు రాగా, అధికారులు సమస్యలు పరిష్కరిస్తామని పేర్కొన్నారు.

చర్యలు తీసుకోవాలి

నిజాంపేట్ : బాచుపల్లి ఆకృతి కన్‌స్ట్రక్షన్ ప్రభుత్వ భూమి (454)ని ఆక్రమించి అప్రోచ్ రోడ్డుగా అనుమతులు పొందడంలో సహకరిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ నిజాంపేట్ బీజేపీ మాజీ అధ్యక్షుడు ఆకుల సతీశ్ ఆధ్వర్యంలో సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తహసీల్దార్ అప్రోచ్ రోడ్డు కోసం స్థలం కేటాయించాలని ఉత్తర్వుల ఆధారంగా హైకోర్టు ఉత్తర్వుల ప్రకారం మున్సిపల్ కమిషనర్ చర్యలు తీసుకోకపోవడమే కాకుండా స్పీకింగ్ ఆర్డర్‌లో పెద్ద చెరువు కట్టపైన 100 ఫీట్ల రోడ్డు ఉందని, చెరువు కట్టకి 10 మీటర్ల బఫర్ ఉందని తెలిపారు. ప్రభుత్వ భూమి కబ్జా కాలేదని అప్రోచ్ రోడ్డు ఉందని ఆకృతికి వత్తాసు పలుకుతూ ఆర్డర్ ఇవ్వడంపై ప్రజావాణిలో ఫిర్యాదు చేశామని తెలిపారు.

హెచ్‌ఎం ఉద్యోగ విరమణ సభ



మాట్లాడుతున్న ఎంఈఓ జెమినికుమారి

చింతల్: గురుమూర్తినగర్ జడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సీహెచ్. సుదర్శన్ ఉద్యోగ విరమణ అభినందన సభను గాంధీనగర్‌లోని ఎస్‌ఆర్. ప్యాలెస్‌లో సోమవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా కుత్బుల్లాపూర్ ఎంఈఓ జెమిని కుమారి హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పాతూరి సుధాకర్ రెడ్డి, కుత్బుల్లాపూర్ మాజీ ఎంఈవో ఆంజనేయులు, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ మహమ్మద్ జాకీర్, మేడ్చల్ జిల్లా యూటీఎఫ్ అధ్యక్షుడు జయసింహారెడ్డి, గాంధీనగర్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి. వెంకట రాములు, ఎం.ఎల్.ఓ రమేశ్, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

హెచ్‌సీయూ విద్యార్థులకు అరుదైన అవకాశం




రాయదుర్గం: స్పార్క్ ప్రాజెక్టులో భాగంగా హెచ్‌సీయూ డాక్టోరల్ విద్యార్థులు క్వీన్స్‌ల్యాండ్ విశ్వవిద్యాలయాన్ని సందర్శించారు. హెచ్‌సీయూలోని ప్రొఫెసర్ కాంచన్ కె మాలిక్, ట్రీసారీనా జాన్ మార్గదర్శకత్వంలో పనిచేస్తున్న వంశీకృష్ణ, హెచ్‌సీయూ కమ్యూనికేషన్ విభాగానికి చెందిన ఇద్దరు పరిశోధక విద్యార్థులు ఆస్ట్రేలియాలోని బ్రిస్బేన్‌లోని క్వీన్స్‌ల్యాండ్ విశ్వవిద్యాలయ సందర్శన సోమవారంతో ముగిసింది. ఈ ప్రాజెక్టులో భాగంగా మూడు కమ్యూనిటీ రేడియో స్టేషన్లను సందర్శించారు. ఆదివాసీ, టోర్రెస్ స్ట్రెయిట్ ద్వీపవాసుల కమ్యూనిటీలకు స్వదేశీ కార్యక్రమాలు అర్థం చేసుకోవడానికి ఎలా ఉపయోగపడిందో తెలుసుకున్నారు.

'మనూ' జాబ్‌మేళాలో 20 మంది ఎంపిక

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో ఉపాధ్యాయుల కోసం నిర్వహించిన ఉద్యోగ మేళాలో 20 మంది అభ్యర్థులకు ఆఫర్ లెటర్లు ఇవ్వగా మరో 45 మంది పేర్లు నమోదు చేయడం జరిగిందని 'మనూ' శిక్షణ, ప్లేస్‌మెంట్ సెల్(టీపీసీ) డైరెక్టర్ డాక్టర్ మహ్మద్ యూసుఫ్‌ఖాన్ వెల్లడించారు. సోమ వారం గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయంలోని టీపీసీ కార్యాలయంలో ఆయన మాట్లా డుతూ వందమందికిపైగా ఉపాధ్యాయ అభ్యర్థులు పాల్గొన్నారని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో 'మనూ' ఫ్యాకల్టీ, అధికారులు పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ అధికారులతో ఎమ్మెల్యే సమీక్షా సమావేశం

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ, హైదర్‌నగర్, వివేకానందనగర్, కూకట్‌పల్లి పార్టు డివిజన్లలో నెలకొన్న సమస్యల పరిష్కారం, చేపట్టాల్సిన పలు అభివృద్ధి పనులపై పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేశ్‌గౌడ్, జీహెచ్‌ఎంసీ ఇంజినీరింగ్ విభాగం అధికారులతో సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. రోడ్ల నిర్మాణాలను ప్రథమ ప్రాధాన్యతగా తీసుకుని అలాగే పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలని, అవసరం ఉన్న చోట నూతన ప్రతిపాదనలు తీసుకోవాలని, మంజూరైన పనులకు త్వరలోనే శంకుస్థాపన చేయాలని సూచించారు. వర్షాకాలంలోగా నాలాల్లో పూడికతీత పూర్తిస్థాయిలో చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఇంజినీరింగ్ విభాగం అధికారులు ఈఈ గోవర్ధన్ గౌడ్, డీఈలు రమేశ్, నిఖిల్, ఏఈలు రాజీవ్, శ్రావణి, సాయి ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.



బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు తరలిరావాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

కుత్బుల్లాపూర్: ఈనెల 27న వరంగల్‌లో నిర్వహించే బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు పెద్ద సంఖ్యలో తరలిరావాలని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ పిలుపునిచ్చారు. గాజులరామారం డివిజన్ యండమూరి ఎన్‌క్లేవ్‌లో సోమవారం సన్నాహక సమావేశం నిర్వహించారు. ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. రాష్ట్రాన్ని బంగారు తెలంగాణగా మార్చిన నాయకుడు కేసీఆర్ అని కొనియాడారు. ఇంతటి ఘనతను సాధించిన పార్టీ సభకు నాయకులు కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ భారీ సంఖ్యలో వెళ్లి విజయవంతం చేద్దామని కోరారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు విజయ్ రాంరెడ్డి, పాక్స్ డైరెక్టర్ పరుష శ్రీనివాస్ యాదవ్, సీనియర్ నాయకులు కస్తూరి బాల్‌రాజ్, అడ్వొకేట్ కమలాకర్, డివిజన్ ఉపాధ్యక్షుడు ఇబ్రహీం ఖాన్, ప్రధాన కార్యదర్శి నవాబ్ భాయ్, యూత్ అధ్యక్షుడు తెలంగాణ సాయి, నాయకులు ఇమ్రాన్ బేగ్, మూసా ఖాన్, మక్సూద్, సుంకరి చందు, చెట్ల వెంకటేశ్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

మల్లారెడ్డి ఆస్పత్రిలో అరుదైన శస్త్ర చికిత్స



మాట్లాడుతున్న మల్లారెడ్డి విశ్వవిద్యా పీఠ్ వైస్ చైర్మన్ డాక్టర్ ప్రీతిరెడ్డి

సుభాష్‌నగర్: సూరారంలోని మల్లారెడ్డి నారాయణ కేన్సర్ హాస్పిటల్ వైద్యులు 24 ఏళ్ల గౌతమ్ అనే యువకుడికి అరుదైన శస్త్ర చికిత్స చేసి కొత్త జీవితాన్ని అందించారు. సోమవారం ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మల్లారెడ్డి విశ్వవిద్యా పీఠ్ వైస్ చైర్మన్ డాక్టర్ సీహెచ్ ప్రీతిరెడ్డి వివరాలు వెల్లడించారు. అరుదైన ప్రైమరీ పెరిటోనియల్ ఎవింగ్స్ సార్కోమాకు అత్యంత ప్రత్యేకమైన విధానం ద్వారా సైటోరేడక్టివ్ సర్జరీ (సీఆర్‌ఎస్) తర్వాత హైపర్‌థెర్మిక్ సర్జరీతో కూడిన చికిత్స విజయవంతంగా అందించామన్నారు. సర్జికల్ ఆంకాలజీ సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ హరీశ్ నేతృత్వంలోని మల్టీడిసిప్లినరీ ఆంకాలజీ బృందం 16 గంటల పాటు శస్త్ర చికిత్సను సక్సెస్‌ఫుల్‌గా పూర్తి చేసిందన్నారు. కార్యక్రమంలో సీనియర్ అనస్తీషియ డాక్టర్ జి. నరేంద్ర ప్రకాశ్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

మనవడి తల వెంట్రుకలు తీసేందుకు వెళ్తూ..



ఆస్పత్రి వద్ద మృతుల బంధువులు

రోడ్డు ప్రమాదంలో చిన్నారితో పాటు అమ్మమ్మ, తాత మృతి



ప్రమాదం నుంచి బయటపడ్డ అష్రఫ్

సుభాష్‌నగర్: మనవడి తల వెంట్రుకలు తీసేందుకు కుటుంబ సభ్యులతో వెళ్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో అమ్మమ్మ, తాతతో పాటు ఏడాదిన్నర మనవడి మృతి చెందడంతో శ్రీకృష్ణనగర్‌లో విషాద ఛాయలు అలుముకున్నాయి. సూరారం డివిజన్ శ్రీకృష్ణనగర్‌కు చెందిన కార్పెంటర్‌గా పనిచేసే ఎండీ ఆలీ (53), అజీమా బేగం (45) దంపతులకు హీరం, అష్రఫ్, సమీన్ ముగ్గురు సంతానం. తన పెద్ద కూతురు హీరంకు కూతుళ్లు మరయం (4), తాజీ మహమ్మద్ (3) ఏడాదిన్నర బాబు మహమ్మద్ గౌస్ ఉన్నారు.

పుట్టు వెంట్రుకలు తీసేందుకు..

హీరం ఏడాదిన్నర కొడుకు మహమ్మద్ గౌస్ పుట్టు వెంట్రుకలు తీసేందుకు సోమవారం తెల్లవారుజామున మెదక్ జిల్లాలోని కొల్చారంలోని దర్గా వద్దకు కుటుంబంతో కలిసి వెళ్లారు. ఈ క్రమంలో కొడిపల్లి మండలం వెంకట్రావుపేట వద్ద ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టడంతో ఎండీ ఆలీ (53), అజియా బేగం (45) ఏడాదిన్నర బాబు మనవడి మహమ్మద్ గౌస్ అక్కడికక్కడే మృతి చెందారు. గాయపడ్డ వారిని సూరారంలోని మల్లారెడ్డి నారాయణ ఆసుపత్రికి తరలించారు. మరయం (4), తాజా మహమ్మద్ (3) పరిస్థితి విషమంగా ఉండడంతో నగరంలోని నీలోఫర్ ఆసుపత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన హీరం, సమీన్ ఐసీయూలో చికిత్స పొందుతున్నారు.

చివరి క్షణంలో వెనక్కి..

ఎండీ ఆలీ కుమారుడు అష్రఫ్, నర్సాపూర్‌లో ఉండే అతని అల్లుడు మేం తర్వాత ఇద్దరం కలిసి బైక్ పై వస్తామని చెప్పడంతో వారు ప్రమాదం నుంచి బయటపడ్డారు.

ఇదే ఆసుపత్రిలో..

6 నెలల క్రితం మల్లారెడ్డి నారాయణ ఆసుపత్రిలో తన అమ్మ అజియా బేగంకు గుండె సర్జరీ జరిగిందని, ఇదే ఆస్పత్రిలో శవమై చూస్తానని అనుకోలేదని కుమారుడు అష్రఫ్ బోరున విలపించాడు.